# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- మహిళల కోసం వర్క్ ఫ్రం హోమ్ పద్ధతిలో ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.
- వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.
- నిరుద్యోగ యువత కోసం నైపుణ్యాభివృద్ధి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహా కుంభమేళా కోసం తూర్పు కోస్తా రైల్వే రెండు ప్రత్యేక రైళ్లను విశాఖపట్నం నుండి నడపనుంది.
- నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం రానున్న 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

చదువుకొని ఇంటిలోనే ఉంటున్న మహిళల కోసం వర్క్ ఫ్రం హోమ్ పద్ధతిలో ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. దీంతో ఆర్థిక కార్యకలాపాలు మరింత పెరుగుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో కో-వర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఈరోజు సచివాలయంలో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాలు, చిన్న పట్టణాల్లో ఉన్న వారికి శిక్షణ ఇచ్చి అవకాశాలు కల్పించాలని... అలాంటి వారి కోసం వర్కింగ్ స్పేస్ లాంటి నూతన పని ప్రదేశాలతో కూడిన వాతావరణం కల్పించాలన్నారు. తద్వారా మహిళలకు విస్తృతంగా అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

==========================

వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఈరోజు విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ షాపింగ్ లలో మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో జవాబుదారీతనం ఉంటుందని, ప్రభుత్వం మాదిరిగానే ప్రతి ప్రైవేట్ సంస్థ జవాబుదారీతనంతో ఉండాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ఆహార కల్తీ నివారణకు జిల్లాకో ల్యాబ్ ఏర్పాటుకు ఆలోచిస్తున్నామన్నారు. చట్టంలోని హక్కులను పౌరులు ఉపయోగించుకోవాలని మంత్రి సూచిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

=========================

నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికే నైపుణ్యాభివృద్ధి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిందని కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన హెచ్ ఆర్ కాంక్లేవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... నైపుణ్యాభివృద్ధి సంస్థలో యువతకు పలు రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారని, నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవడం ద్వారా యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సులువుగా పొందవచ్చునని తెలిపారు.

=========================

మహా కుంభమేళా నేపథ్యంలో భారతీయ రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న కుంభమేళాకు దేశ నలుమూలల నుంచి ప్రత్యేక రైళ్లను నడపనుంది. వీటిలో భాగంగా విశాఖ నుండి ప్రజల సౌకర్యార్థం తూర్పుకోస్తా రైల్వే 2 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. విశాఖ- గోరఖ్‌పూర్ మధ్య జనవరి 5, 19, ఫిబ్రవరి 16 తేదీల్లోనూ, తిరుగు పయనంలో జనవరి 8, 22, ఫిబ్రవరి 19 తేదీల్లో ఈ ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపుర, ఛత్రపూర్, బల్‌గావ్, ఖుర్దారోడ్డు, భువనేశ్వర్ తదితర స్టేషన్లలో ఈ రైలు ఆగుతుందని అధికారులు తెలిపారు. అలాగే విశాఖపట్నం- దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ స్టేషన్ల మధ్య జనవరి 9, 16, 23, ఫిబ్రవరి 6, 20, 26 తేదీల్లో మరో ప్రత్యేక రైలు సింహాచలం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ తదితర స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందని వెల్లడించారు. యాత్రికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

=========================

నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో కోస్తా జిల్లాలకు భారీ వర్షాల కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరాల వైపు ఈ అల్పపీడనం పయనిస్తుందని, ఇది పశ్చిమ-నైరుతి దిశగా కదులుతూ వచ్చే 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం తీరానికి సమీపంలో కదులుతున్న నేపథ్యంలో మేఘాలు కమ్ముకుని, చలిగాలులు వీస్తున్నాయని.. దీని ప్రభావంతో రానున్న 4 రోజుల వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. వర్షాల నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసారు.

విరామం

=========================

జపాన్‌లోని టోయామా ప్రాంతానికి చెందిన గవర్నర్ హచిరో నిట్టా నేతృత్వంలోని 14 మంది సభ్యుల బృందం ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించింది. ఈబృందం మంగళగిరి ఎపిఐఐసిలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒక కొత్త అవగాహన ఒప్పందాన్ని

కుదుర్చుకుంది. వాణిజ్య, వ్యాపార రంగాలలో పరస్పర సహకారం, సాంస్కృతిక సంబంధాల పెంపు, విద్యార్థులు, పరిశోధకుల మధ్య అనుసంధాన కార్యక్రమాలు, డిజిటల్ రంగంలో సాంకేతిక సహకారం, ఔషధ తయారీ రంగంలో సహకారం వంటి పలు అంశాలపై అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి. టోయామా గవర్నర్ హచిరో నిట్టా మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ఒక జపనీస్ జెన్ గార్డెన్ ఏర్పాటు చేయడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

==========================

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దత్తత గ్రామమైన పశ్చిమగోదావరి జిల్లాలోని పెదమైనవానిలంకలో ఏర్పాటు చేసిన డిజిటల్ శిక్షణ కేంద్రం అనేక మందికి చేతివృత్తులలో శిక్షణ అందిస్తోంది. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా నిరక్షరాస్యులకు గ్రామీణ ప్రాంతంలో ఉపాధి పొందుతున్న మహిళలకు కొబ్బరి చీపుర్లు, బుట్టలు తయారు చేసే పనుల్లో నైపుణ్యంతో కూడిన శిక్షణను డిజిటల్ సెంటర్లో అందజేస్తున్నారు. ఈ డిజిటల్ శిక్షణాకేంద్రంలో శిక్షణ పొందిన మహిళా లబ్ధిదారులు ఆకాశవాణితో మాట్లాడుతూ, ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చారని, శిక్షణకాలంలో 4 వేల రూపాయలు గౌరవ వేతనంతో పాటు, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా డిజిటల్ ట్రైనింగ్ సెంటర్ సహాయ సంచాలకులు వసంతరావు మాట్లాడుతూ....

(వాయిస్ 32 సెకన్లు)

==========================

శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం పెద్ద కొజ్జియా జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఈరోజు ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. ఐదుగురితో ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని అతివేగంగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా... మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

==========================

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సమావేశం ఈరోజు తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో జరిగింది. సమావేశం అనంతరం టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావు పాత్రికేయులతో మాట్లాడుతూ... తిరుమలలో తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దర్శనం, వసతి సౌకర్యాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. టీటీడీ కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లాలని నిర్ణయించామని, దీనిపై ఓ కమిటీ వేసి నివేదిక ఇవ్వాలని సూచించామన్నారు. తిరుపతి స్విమ్స్ కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో టీటీడీ ఆలయాలు నిర్మిస్తామని తెలిపారు. తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించామని శ్యామలరావు వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================
==========================